వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
గురువారం , నవంబరు 13, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## డిసెంబర్ 5న పుతిన్ భారత పర్యటన



న్యూఢిల్లీ, నవంబర్ 13 (2025): రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల డిసెంబర్ 5న భారత్‌ను సందర్శించనున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగుతున్న సమయంలో జరుగుతున్న ఈ పర్యటన భారత్-రష్యా ద్వైపాక్షిక బంధానికి కొత్త ఊపు ఇవ్వనుందని భావిస్తున్నారు. పుతిన్ పర్యటన సందర్భంగా న్యూఢిల్లీలో జరగనున్న రష్యా-భారత్ ఫోరమ్ ప్లీనరీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశాన్ని రోస్‌కాంగ్రెస్ సంస్థ నిర్వహిస్తోంది. పుతిన్ పర్యటన తేదీలను గతంలోనే క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది.

# రిపబ్లిక్ డే రోజున దాడుల కోసం ప్లాన్




**న్యూఢిల్లీ, నవంబర్ 12 (వాయిస్‌టుడే)**

రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నవంబర్ 10న సాయంత్రం జరిగిన ఘోర పేలుడు కేసులో దర్యాప్తు అధికారులు కీలక విషయాలు గుర్తించారు. ప్రధాన నిందితులలో ఒకడైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్.. గణతంత్ర దినోత్సవం, దీపావళి వంటి జాతీయ కార్యక్రమాల సమయంలో ఉగ్రదాడులు చేయడానికి ప్లాన్ చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడని తెలుస్తోంది.అధికారుల అనధికారిక సమాచారం ప్రకారం, ముజమ్మిల్ విచారణలో తన సహచరుడు ఉమర్‌తో కలిసి ఈ ఏడాది ప్రారంభంలో ఎర్రకోట ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు అంగీకరించాడు. జనవరి 26, 2026న గణతంత్ర దినోత్సవం వేడుకల సమయంలో దాడి చేయడానికి ఈ రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. ముజమ్మిల్ మొబైల్ ఫోన్ నుండి సేకరించిన లొకేషన్ డేటా, ఎర్రకోట చుట్టుపక్కల ప్రాంతాలకు చాలాసార్లు వెళ్లినట్లు నిర్ధారించింది. ఇండియా టుడే కథనం ప్రకారం, దీపావళి సమయంలో దాడి చేసేందుకు మొదట ప్లాన్ చేసుకున్నా.. చివరి నిమిషంలో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు కూడా అతను వెల్లడించాడు.పుల్వామాకు చెందిన సీనియర్ డాక్టర్ అయిన ముజమ్మిల్, ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీగా పనిచేశాడు. జైషే మహ్మద్ , అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ వంటి నిషేధిత సంస్థలతో సంబంధాలు ఉన్న "వైట్-కాలర్ టెర్రర్ మాడ్యూల్"తో ముజమ్మిల్‌కు సంబంధాలు ఉన్నాయని అధికారుల నమ్మకం విచారణలో క్రమంగా బలపడుతోంది.ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్, నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర హ్యుందాయ్ i20 కారులో పేల్చివేసుకుకుని మృతిచెందాడు. ఈ పేలుడులో 12 మంది మరణించగా, 20 మంది వరకు గాయపడ్డారు. దీంతో ఢిల్లీలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు తరువాత ఢిల్లీ మొత్తం భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసులు, పారామిలిటరీ బలగాలు గస్తీని పెంచాయి. గాజీపూర్, సింఘు, టిక్రీ, బదర్‌పూర్ సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. మెట్రో స్టేషన్లు, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్ లాంటి జనసంచారం అధికంగా ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పుల్వామాకు చెందిన ఇతడిని విచారించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. అధికారులు అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డేటాను విశ్లేషించగా, అతడు మహమ్మద్ ఉమర్‌తో కలిసి పలుమార్లు ఎర్రకోట వద్ద రెక్కీ నిర్వహించినట్లు

- మిగతా 2వ పేజీలో



## శభాష్ రేవంత్..

**హైదరాబాద్, నవంబర్ 12, (వాయిస్‌టుడే)**

ముఖ్యమంత్రి అయినంత మాత్రాన దర్బార్లో ఉండాల్సిన అవసరం లేదు. రాజమహల్ లో సకల సౌకర్యాలు అనుభవించాల్సిన పనిలేదు. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచాడు కాబట్టి.. ప్రజలకు అందుబాటులో ఉంటే సరిపోతుంది. కష్టాలను, కన్నీళ్లు తుడిచి నేను ఉన్నానని భరోసా ఇస్తే ఆ నాయకుడిని పది కాలాలపాటు ప్రజలు కంటికి రెప్పలా చూసుకుంటారు.. నవీన్ పట్నాయక్, మనోహర్ పారికర్, బుద్ధదేవ్ భట్టాచార్య.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది.. వాస్తవానికి ముఖ్యమంత్రి పీఠం అనేది అత్యంత సవాళ్లతో కూడుకున్న స్థానం. అటువంటి స్థానానికి చాలామంది వన్నె తీసుకొచ్చారు.. తన పాలనదక్షతో.. అద్భుతమైన వ్యవహార శైలితో ఆకట్టుకున్నారు.తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే కొంతమంది ముఖ్యమంత్రి

- మిగతా 2వ పేజీలో



## ఇదేనా బంగారు తెలంగాణ?
### రెండు ప్రభుత్వాల పాలనలో మార్పు లేదు:కవిత

**నల్గొండ, నవంబర్ 12 (వాయిస్‌టుడే )**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రాష్ట్రంలోని సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. రెండు ప్రభుత్వాల హయాంలోనూ ప్రజల కష్టాలు తీరలేదని, ఇదేనా బంగారు తెలంగాణ అని ఆమె ప్రశ్నించారు. బుధవారం నల్గొండలో పర్యటించిన ఆమె, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు.నల్గొండ జిల్లాకు గత 12 ఏళ్లుగా కృష్ణా జలాలు పూర్తి స్థాయిలో అందాయో లేదో ఆలోచించుకోవాలని కవిత అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట కూడా అనలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రాజెక్టుల వద్దకు తాము వెళ్తే నిర్వాసితులు

- మిగతా 2వ పేజీలో

# అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

### నాణ్యతతో రాజేపడేది లేదు
### తేడా వచ్చిన ఉపేక్షించేది లేదు..
### సమీక్ష సమావేశంలో మంత్రులు పొంగులేటి,లక్ష్మణ్, కొండా సురేఖ, సీతక్క
### మేడారంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన



ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.బుధవారం ములుగు జిల్లా ఎస్.ఎస్ తాడ్వాయి మండలం మేడారం అభివృద్ధి పనుల పరిశీలనకు హెలికాప్టర్ లో రాష్ట్ర మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,దనసరి అనసూయ సీతక్క,మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్,చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్ శ్రీనివాసరాజు లు విచ్చేశారు.ఈ సందర్భంగా మంత్రులు శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మేడారం లోని హరిత కాకతీయ హెటల్ లో సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి,మాస్టర్ ప్లాన్ రూపకల్పన పై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారం లో కోనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రాకారం లోపల,సివిల్ పనులు,గద్దెల ఎత్తు పెంచడం,నిర్మాణం,ప్రధాన ద్వారాలు,స్వాగత తోరణం,4 వాచ్ టవర్లు,ప్రాకారనికి చుట్టూ సిసి రోడ్డు పనులను సమాంతరంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. దీనికితోడుగా గ్రీనరీ,ప్లాంటేషన్ చేయాలన్నారు.కావలసిన గ్రానైట్ వేగవంతంగా తెప్పించుకోవాలని కోరారు.మెయిన్ మెటీరియల్ పెంచి 24 గంటలు పనులు జరగాలన్నారు.మేడారం లో రోడ్డు నిర్మాణ పనులు డివైడర్లు,ప్లాంటేషన్ తో సహా నెల రోజుల్లో పూర్తి కావాలన్నారు.మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షేడ్స్,4 రోడ్డు లైన్ల విస్తరణ,టెంపుల్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ 3 వేల నుండి 10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు.19 ఎకరాలు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి కోరిన విధంగా జంపన్నవాగు పై చెక్ డ్యామ్ ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.శాశ్వత బస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని,పర్యాటక శాఖ ద్వారా జంపన్నవాగు అభివృద్ధి, సుందరికరణ ప్రతిపాదనలు సిద్ధం చెయాలన్నారు.పశు సంవర్ధక శాఖ ద్వారా 4 అధునాతన పశు వదశాలల ఏర్పాటు చేయాలని తెలిపారు.మేడారం చుట్టుప్రక్కల రహదారులకు మరమ్మతులు చేయాలి.మేడారం కు వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి అడ్డంకులు ఉండకుండా ప్రధాన రహదారిలో అక్కడక్కడ మిగిలి ఉన్న పనులతో పాటు మల్లంపల్లి బ్రిడ్జి,కటాక్షపూర్ బ్రిడ్జి పై ప్రత్యేక శ్రద్ధ చూపి డిసెంబర్ 15 లోగా పూర్తి కావాలని నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22 న మరోసారి వస్తామని,నిర్దేశిత ఆయా పనులు పూర్తి కావాలని అన్నారు. నాణ్యతతో రాజేపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే

- మిగతా 2వ పేజీలో



## ఓటింగ్‌కు దూరంగా జూబ్లీ ప్రజలు

**హైదరాబాద్, నవంబర్ 12, (వాయిస్‌టుడే )**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏ బూత్‌లో కూడా రీ పోలింగ్ లేకుండా పక్కా ఏర్పాట్లతో ప్రక్రియను అధికారులు పూర్తి చేశారని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య కాసేపు వాగ్వాదాలు మినహా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలింగ్ ప్రక్రియ సాగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు మినహా ఎక్కడా శ్రుతి మించిన ఘటనలు లేవు. కొన్న బూత్‌ల వద్ద కాంగ్రెస్ నేతల అతి ఉత్సాహం కేసులకు దారి తీసింది. ఉదయం నుంచి బూత్‌ల వద్దకు చేరుకున్న ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. 14వ తేదీ

- మిగతా 2వ పేజీలో

# కనీసం పోటీ ఇవ్వలేకపోయిన కమలం
## సర్వేలు తేల్చి చెప్పిన నిజం

**హైదరాబాద్, నవంబర్ 12, (వాయిస్‌టుడే)**



లంగాణ రాష్ట్రంలో ఎంతో ఉత్కంఠ కలిగించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు పూర్తయ్యాయి. గడిచిన కొద్దిరోజులుగా గులాబి, కషాయం, కాంగ్రెస్ పార్టీలు ఈ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశాయి. మూడు పార్టీల కీలక నాయకులు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. గులాబీ పార్టీ అయితే సోషల్ మీడియాలో రెచ్చిపోయింది.. కాంగ్రెస్ పార్టీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.. పలు న్యూస్ చానల్స్ కు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికలో వచ్చే ఫలితాన్ని తెలంగాణ ప్రజలు ఇచ్చే రెఫరెండం అని ఆయన పేర్కొన్నారు.సుమారు నాలుగు లక్షలకు పైచిలుకు ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మంగళవారం పోలింగ్ జరిగింది.. రహమత్ నగర్ నుంచి మొదలుపెడితే బోరబండ వరకు ఎన్నికల సంఘం అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించింది.. పోలింగ్ శాతం అధికారులు అంచనా వేసినట్టుగా నమోదు కాకపోయినప్పటికీ.. మంగళవారం పొద్దుపోయే వరకు పోలింగ్ జరిగింది. కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్, గులాబీ పార్టీ నాయకుల మధ్య గొడవలు జరిగాయి. రెండు పార్టీలకు సంబంధించిన నాయకులు పరస్పరం ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలింగ్ ముగిసిన తర్వాత సుప్రీంకోర్టు మార్గ దర్శకాలకు అనుగుణంగా కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి.. ఇందులో మెజారిటీ సంస్థలు జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో గెలిచే అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టం చేశాయి.. చాణక్య స్ట్రాటజీస్ అనే సంస్థ వెల్లడించిన ఎగ్జిట్ పోల్ లో

- మిగతా 2వ పేజీలో

# డీసీసీలకు మోక్షం.. జాబితా రెడీ

**హైదరాబాద్, నవంబర్ 12, (వాయిస్‌టుడే )**

: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవులను ఏఐసీసీ త్వరలోనే ప్రకటించనుంది. డీసీసీ పదవుల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులకు ఒకటి, రెండు రోజుల్లో తీపి కబురు రానుంది. డీసీసీ పీఠాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం తుది కసరత్తు చేసినప్పటికి.. తెలంగాణలో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక, ఇతర కారణాలతో ప్రకటన వాయిదా పడుతూ వస్తున్నది.పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు తీసుకుని 14 నెలలు పూర్తయింది. అయినా పాత కమిటీలతోనే నెట్టుకొస్తున్నారు. ఇక వాయిదా వేయకుండా జిల్లా కాంగ్రెస్ రథసారథులను ప్రకటించాలనే నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చింది. పదవుల పంపకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులతోనూ పార్టీ అధిష్ఠానం పలుమార్లు చర్చించింది.ఆ తర్వాతనే ఫైనల్ జాబితాను రూపొందించినట్లుగా పార్టీ వర్గా లు చెబుతున్నాయి. అయితే గతంలో జిల్లా కు చెందిన ముఖ్య నాయకులు తమ అనుచరుల కోసం




- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే

గురువారం , నవంబరు 13, 2025

# అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

అన్ని పనులను పూర్తి చేస్తామని,గిరిజన పూజార్ల సూచన మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు.ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేస్తామని అన్నారు.వచ్చే రెండు వందల సంవత్సరాల కాలం పాటు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని,25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, భవిష్యత్ లో 10కోట్ల మంది భక్తులకు సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,మేడారం మాస్టర్ ప్లాన్ పై త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజనుల సాంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని,అన్ని పనులను పూర్తి చేసి రానున్న మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

**మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ..**

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని,గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తున్నదని వివరించారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని,రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగ గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ధేశించిన సమయంలో సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

**అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ..**

రాష్ట్ర సాంఘిక మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని.. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.




**సీతక్క మాట్లాడుతూ..**

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గిరిజనుల అస్తిత్వం,ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూనే పనులు చేపడుతున్నట్లు , మరో వారం రోజుల్లోగా గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని వివరించారు. భక్తులు విశ్వాసం నమ్మకంతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్నారని, వారి విశ్వాసం దెబ్బ తినకుండా ఆదివాసీల అస్తిత్వం కాపాడుకుంటూ పనులు పూర్తి చేస్తామని అన్నారు.. అనంతరం మంత్రులు హెలికాప్టర్ లో హైదరాబాదుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్,దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హారీష్,జిల్లా కలెక్టర్ దివాకర్,ములుగు ఎస్.పి శబరిష్, డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సి.హెచ్ మహేందర్ జి,సంపత్ రావు,ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఆర్ అండ్ బి,పి.ఆర్ ఈ ఎన్ సి, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు,పూజారులు,జిల్లా అధికారులు,ఆర్కిటెక్చర్,గుత్తేదారులు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటింగ్‌కు దూరంగా జూబ్లీ ప్రజలు

ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. మధ్యాహ్నానికి విజేతపై క్లారిటీ రానుంది. ఎప్పటి మాదిరిగానే బస్తీల్లో జనం తప్ప భవంతుల్లో ఉన్న ఓటర్లు ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. అందుకే మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తక్కువ పోలింగ్ శాతం నమోదు అయ్యింది. సాయంత్రం పోలింగ్ పూర్తి ముగిసే సమయానికి మొత్తం 48.24 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇందులో పురుషులు 47.59 శాతం మంది వచ్చి ఓట్లు వేయగా, మహిళలు 48.95 శాతం వేశారు. గతంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ, అయితే ఇందులో ఇంకో కోణం ఏంటంటే, గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కాస్త బెటర్ అన్నమాట.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 47.58 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. అంతకు ముందు ఎన్నికలు అంటే 2018లో 45.61 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. తెలంగాణ వచ్చిన జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదు అయ్యింది. 2014లో 56.85 శాతం నమోదు అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో 52.80శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఈ ఏడాది తప్ప ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ గెలుస్తూ వచ్చారు. అయితే ఆయన అకాల మరణంతో ఇక్కడ ఇప్పుడుఉపఎన్నిక అనివార్యమైంది. ఆయన తరఫున భార్య సునీత పోటీ చేస్తున్నారు. ఆయనకు పోటీగా కాంగ్రెస్ తరఫున సునీల్ యాదవ్ ఉన్నారు. దీంతో విజయం ఎవరివైపు ఉందనే ఆసక్తి నెలకొంది. ఇక్కడ ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంది. గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసిన ఎంఐఎం ఈసారి పోటీలో లేదు. వారి మద్ధతు కాంగ్రెస్‌కు ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెప్పారు. ఇప్పుడు వారి ఓట్లు ఎటు పడ్డాయో అన్న ఉత్కంఠ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో ఉంది. అందుకే కచ్చితంగా గెలుపు తమవైపు ఉందనే ధీమా ఎవరిలో లేదు. గెలుస్తున్నామని మీడియా ముందు చెబుతున్నా సన్నిహితులతో మాత్రం విజయంపై డైలమాలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. అందుకే పోలింగ్ రోజుల ఆఖరి బ్యాలెట్ సురక్షితంగా ప్రాంతంలో ఉంచి లాక్ చేసే వరకు ఇరు పార్టీల నేతలు డేగకళ్లతో పరిస్థితులను గమనిస్తూ వచ్చారు. రోజుంతా ఇరు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేతలు రెండుసార్లు ఫిర్యాదులు చేశారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని, బీఆర్ఎస్ నేతలను బెదిరిస్తున్నారని బూత్‌ల్లోకి రానివ్వడం లేదని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆగడాలు శ్రుతిమించిపోయాయని బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ధర్నాకే దిగారు. మొత్తానికి ఆఖరి నిమిషం వరకు పోటాపోటీగా విజయం కోసం ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేశారు.దీంతో విజయం ఎవరివైపు ఉందో అన్న ఉత్కంఠ మాత్రం 14 వరకు కొనసాగనుంది. ఒకసారి బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ చేస్తే ఎవరి జాతకం ఏంటో తెలిపోనుంది. అంత వరకు ఎవరి ధీమా వాళ్లకు ఉంటోంది. మరోవైపు వివిధ సర్వేసంస్థలు ఈ ఎన్నికపై సర్వేలు నిర్వహించాయి. ఇందులో కొన్ని ఆయా పార్టీలకు మద్దుతుగా ఉన్నందున వాటి సర్వేలను నమ్మడానికి జనం సిద్ధంగా లేదు. అందుకే 14వ తేదీ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాముఖ్యం ఉన్న సర్వేలు ఒకట్రెండు కాంగ్రెస్ విజయానికి అవకాశాలు ఉన్నాయని చెబుతుంటే, మరికొన్ని బీఆర్ఎస్ విజయం ఖాయమనే విధంగా అంచనాలు వేస్తున్నాయి.

# డీసీసీలకు మోక్షం.. జాబితా రెడీ



పైరవీలు చేసి.. పదవిని దక్కిం చుకునే వారు. కానీ, పార్టీ అధిష్ఠానం మా త్రం ఆ విధానానికి చెక్ పెట్టింది. ఎవరి ప్ర మేయం లేకుండానే పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. అందుకు ఏఐసీసీనే నేరుగా రంగంలోకి దిగి గతంలోఎన్నడు లేని విధంగా పరిశీలకులను నియమించింది.ఏఐసీసీ పరిశీలకులను తమకు కేటాయించిన జిల్లాలలో పర్యటించి.. క్షేత్ర స్థాయి నుంచి అభిప్రాయలు సేకరించారు. అంతే కాకుండా డీసీసీ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీసీసీ పదవుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యువత, మహిళలకు 50 శాతానికి పైగా అవకాశం ఇవ్వాలని నిర్ణయంతో పాటు పార్టీలో దాదాపు ఐదేళ్లుగా పనిచేసి ఉండాలని నిబంధన కూడా పెట్టిన విషయం తెలిసిందే.వీటితో పాటు ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా కొనసాగుతున్న వారికి మళ్లీ అవకాశం ఇవ్వొద్దని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఒకటి, రెండు చోట్ల ఎమ్మెల్యేలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులు అప్పగించే అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది. దీంతో చాలా మంది సీనియర్లు తమ కంటే తమకే పదవి వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో పార్టీ పరంగా డీసీసీ అధ్యక్షులే కీలకం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు నేరుగా డీసీసీ అధ్యక్షులతో మాట్లాడే అవకాశం ఉంది. అంతే కాకుండా పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ పరిస్థితితో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు డీసీసీ అధ్యక్షులే బీ ఫామ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఒక్కో జిల్లాలకు పదుల సంఖ్యలో పార్టీ పరిశీలకులకు దరఖాస్తులు చేసుకున్నారు.అయితే జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మాత్రం తమ, తమ అనుచరుల పేర్లను పరిశీలకులకు చెప్పి.. మద్దతుగా ఉండాలని క్షేత్రస్థాయిలోని పార్టీ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఏఐసీసీ పరిశీలకులు వారికి కేటాయించిన జిల్లాలలో సమావేశాల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమై..జిల్లాల పర్యటన వివరాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పరంగా వచ్చిన పీడ్ బ్యాక్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షినటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరించారు. అయితే ఏఐసీసీ పరిశీలకులు ఎవరి పేర్లను పార్టీ అధిష్ఠానానికి సిఫారసు చేశారనేది ఆసక్తిగా మారింది.

# ఆ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు

ఈ విషయంలో చేసిన తప్పుకు క్షమించండి: ప్రకాశ్ రాజ్

బెట్టింగ్ యాప్‌ల కేసులో సిట్ ఎదుట విచారణకు ప్రకాశ్ రాజ్

2016లో తాను ప్రమోట్ చేశానని,

ఆ తర్వాత దానిని రద్దు చేసుకున్నానని వెల్లడి

తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పుతప్పే అన్న ప్రకాశ్‌రాజ్



బెట్టింగ్ యాప్స్‌లు, గేమింగ్ యాప్స్‌లలో పెట్టుబడులు పెట్టి ఎంతోమంది యువత ఆర్థికంగా నష్టపోతున్నారని, దీనివల్ల వారి కుటుంబాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నటుడు ప్రకాశ్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2016లో తాను ఒక యాప్‌న ప్రమోట్ చేశానని, అయితే ఆ యాప్ 2017లో బెట్టింగ్ యాప్‌గా రూపాంతరం చెందిందని ఆయన తెలిపారు. వెంటనే తాను ఆ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేనని ప్రకాశ్ రాజ్ అన్నారు. ఈ విషయంలో తాను క్షమాపణ కోరుతున్నానని ఆయన తెలిపారు. సిట్ అధికారులకు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డాక్యుమెంట్స్, బ్యాంకు లావాదేవీలను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ల కారణంగా ఎంతోమంది నష్టపోయి, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడితేనే ఫలితం ఉంటుందని, కష్టపడితేనే డబ్బులు వస్తాయని కాబట్టి అందరూ కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు తనను క్షమించాలని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటానని ఆయన అన్నారు.

# శభాష్ రేవంత్..

గొప్ప పరిపాలన అందించి ప్రజల మన్నన పొందారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనతను కేసీఆర్ పొందారు. కెసిఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఉద్యమ సమయంలో ఆయన ఎటువంటి ధోరణి అయితే అవలంబించారో ముఖ్యమంత్రి అయిన తర్వాత అంతకుమించి అనే స్థాయిలో ప్రజలకు దూరంగా ఉన్నారు. అయితే ప్రగతిభవన్ లేదా వ్యవసాయ క్షేత్రంలో ఉండేవారు. ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదు. కొన్ని సందర్భాలలో సొంత మంత్రులకు కూడా ఆయన అపాయింట్మెంట్ ఇచ్చేవారు కాదు. అప్పట్లో హోం శాఖ మంత్రి మహమూద్ ఆలిని కూడా ఆయన ఫామ్ హౌస్ గేట్ నుంచి బయటికి పంపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ పరిపాలన కాలంలో జరిగిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. అందువల్లే తెలంగాణ ప్రజలు మూడోసారి కెసిఆర్ నాయకత్వాన్ని నమ్మలేదు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రజలకు దూరంగా ఉన్న విధానం.. ఇతర వ్యవహారాలను పరిశీలించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సాధ్యమైనంతవరకు ప్రజలకు దగ్గరగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. హంగు ఆర్భాటాలకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. తాజాగా ప్రజా కవి అందెశ్రీ చనిపోతే.. ఆయన పాడెను మోశారు. అంత్యక్రియల ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన అక్కడే ఉన్నారు. అంతేకాదు అందెశ్రీ భార్యను ఓదార్చి అనునయించారు. తాను అండగా ఉంటానని ఆమెకు భరోసా ధైర్యం కల్పించారు. రేవంత్ చేసిన పని చివరికి గులాబీ పార్టీ నేతలకు కూడా నచ్చింది. బిజెపి నాయకులు కూడా రేవంత్ చేసిన పని పట్ల అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పరిపాలనపరంగా.. విలేకరుల సమావేశాల్లో మాట్లాడే మాటలపరంగా రేవంత్ రెడ్డి కొంతమందికి నచ్చకపోవచ్చు. కానీ కొన్ని సందర్భాలలో ఆయన ప్రత్యర్థులకు కూడా నచ్చుతాడు. మంగళవారం చేసిన పని కూడా అటువంటిదే.

## రిపబ్లిక్ డే రోజున దాడుల కోసం ప్లాన్

తేలింది. జనవరి 26న ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలో అక్కడ భారీ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌కు, ఢిల్లీ కారు పేలుడు ఘటనకు సంబంధం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. డాక్టర్ ముజమ్మిల్ ఫోన్ నుంచి లభించిన ఆధారాలతో ఈ కేసు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. ఈ కుట్రలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వారి ప్రణాళికలు ఏమిటి? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. చదువుకున్న వైద్యులే ఉగ్రవాదం వైపు మళ్లడంపై భద్రతా ఏజెన్సీలు దృష్టి సారించాయి.కీలకమైన ప్రాంతాలు, రద్దీగా ఉండేప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌లు, యూనిట్లు, మెటల్ డిటెక్షన్ బృందాలను మోహరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు లేదా వస్తువులేమైనా కనిపిస్తే వెంటనే అత్యవసర హెల్ప్‌లైన్‌లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఇదేనా బంగారు తెలంగాణ?

కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవని, ఐసీయూలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు.ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. భూదాన్ భూములను ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ కుడి కాలువ ఏపీ చేతుల్లో ఉంటే, ఎడమ కాలువను కేంద్రం చేతుల్లో పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని, దానికోసం జాగృతి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతులు పండించిన పత్తిలో 20 శాతం తేమ ఉన్నప్పటికీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అంతకుముందు, కవిత పర్యటనను పురస్కరించుకుని జాగృతి నాయకులు నల్గొండ పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అయితే, మున్సిపల్ అధికారులు వాటిని రాత్రికి రాత్రే తొలగించడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు, మంత్రి కోమటిరెడ్డికి ఎలాంటి పంచాయతీ లేదు. అయినా నా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారు?" అని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్ట్ చేసిన జాగృతి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాను ప్రజా సమస్యలపై పోరాడేందుకే నల్గొండ వచ్చానని, రాజకీయాలు చేసేటప్పుడు బలమైన అభ్యర్థులనే బరిలో దింపుతామని అన్నారు. "జాగృతి నాయకులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదు" అని కవిత వ్యాఖ్యానించారు.

## కనీసం పోటీ ఇవ్వలేకపోయిన కమలం

కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశాలు 46%, గులాబీ పార్టీకి గెలిచే అవకాశం 41 శాతం, భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం అవకాశం ఉందని పేర్కొంది. పీపుల్స్ పల్స్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశం 48%, గులాబీ పార్టీకి 41 శాతం, బిజెపికి ఆరు శాతం ఉందని తేల్చింది. స్మార్ట్ పోల్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి 48.2, గులాబీ పార్టీకి 42.1 శాతం , భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం గెలిచే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది. నాగన్న సర్వే కాంగ్రెస్ పార్టీకి 47%, భారత రాష్ట్ర సమితికి 41 శాతం, బిజెపికి 8 శాతం గెలిచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

## నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై భారీ జరిమానాలు : మంత్రి పొన్నం ప్రభాకర్

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించే వాహనాలపై కఠిన చర్యలు

రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు

ఓవర్‌లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా చర్యలు

రాష్ట్రస్థాయిలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు నిర్ణయం

రోడ్ సేఫ్టీ మంత్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచన

మహిళా ఆటోలకు అనుమతుల జారీపై ప్రభుత్వం సానుకూలం



హైదరాబాద్, నవంబర్ 12:రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "ట్రాఫిక్ నియమాలను అతిక్రమించే వాహనదారులపై భారీ జరిమానాలు విధించాలి. ఓవర్‌లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి," అని మంత్రి స్పష్టం చేశారు. బుధవారం ఆయన రవాణా శాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థ నిరంతరంగా పని చేసేలా ప్రణాళిక రూపొందించి దాన్ని కఠినంగా అమలు చేయాలి అని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్ సేఫ్టీ పర్యవేక్షణ కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాబోయే రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.



## జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

పటాన్చెరు : మదినగూడ నుండి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జాతీయ రహదారుల సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహెచ్ఇఎల్ చౌరస్తా నుండి రుద్రారం గణేష్ గడ్డ వరకు చేపడుతున్న పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని తెలిపారు. దీని మూలంగా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అశోక్ నగర్, బీరంగూడ, రామచంద్రపురం, పటాన్చెరు పట్టణాల పరిధిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల అంశంలో సంయుక్త పరిశీలన చేసిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని.. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ, నిర్మాణ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, రమేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గీతం ఆర్కిటెక్చర్ స్కూల్‌ను సందర్శించిన పాఠశాలల విద్యార్థులు

### పాల్గొన్న కేంద్రీయ విద్యాలయం (గోల్కొండ, బోయిన్ పల్లి), సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ కళాశాలలు



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: విద్యాపరమైన ప్రోత్సాహక కార్యక్రమంలో భాగంగా, కేంద్రీయ విద్యాలయం (గోల్కొండ, బోయిన్ పల్లి)లతో పాటు సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థులు ఇటీవల హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ను సందర్శించారు.

ఓపెన్ హౌస్ లో భాగంగా, సందర్శించడానికి వచ్చిన 11, 12వ తరగతి విద్యార్థులకు ముఖాముఖి ప్రదర్శనల ద్వారా నిర్మాణ అభ్యాసంపై సృజనాత్మక, లోతైన అవగాహనను కల్పించారు. గీతం ఆర్కిటెక్చర్ అధ్యాపకులు, విద్యార్థులతో వారు మాట్లాడి, స్టూడియో సంస్కృతి, డిజైన్ ప్రక్రియలు, సృజనాత్మక సమస్య పరిష్కారంపై విలువైన సమాచారాన్ని పొందారు. ఈ సందర్శన ఉత్సుకతను రేకెత్తించడంతో పాటు యువ అభ్యాసకులలో ఆర్కిటెక్చర్ ను సృజనాత్మక, విద్యాపరమైన అంశంగా ఎంపిక చేసుకోవడానికి ప్రేరణనిచ్చింది. వారి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం డిజైన్ ఆధారిత విభాగాలపై పెరుగుతున్న ఆసక్తిని, అనుభవపూర్వక అభ్యాస విలువను ప్రతిబింబించింది. తదుపరి తరం డిజైనర్లు, ఆవిష్కర్తలను ప్రేరేపించడానికి గీతం యొక్క నిబద్ధతను ఈ చొరవ చాటిచెబుతోంది.




## 22న రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల స్నాతకోత్సవం

హైదరాబాద్, నవంబర్ 12: మహిళా విద్యను ప్రోత్సహించేందుకు రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి హైదరాబాద్ మహిళా విద్యా సంఘంను స్థాపించారు. ఆ సంఘం ద్వారా ప్రస్తుతం మాడపాటి హనుమంతరావు హైస్కూల్, రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల, ఫార్మసీ కళాశాలలు కొనసాగుతున్నాయి. 1954లో అప్పటి ప్రధానమంత్రి పండిత్ జవహార్ లాల్ నెహ్రూ రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1955లో భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్ ను 1959లో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. 1965లో అప్పటి కేంద్రమంత్రి ఇందిరాగాంధి కళాశాల ప్రాంగణలో ఏర్పాటు చేసిన కొండా వెంకట రంగారెడ్డి విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. 2005లో జరిగిన కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు అప్పటి భారత రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం హాజరై విద్యార్థినులను ప్రోత్సహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది విద్యార్థినీలకు ఉన్నత విద్యను అందిస్తూ జాతీయ స్థాయిలో 150 నుంచి 300 మధ్యలో ర్యాంకుల్లో కొనసాగుతూ కళాశాల అదర్శవంతంగా నిలుస్తోంది. రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 14వ స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 22వ తేదీన శనివారం నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె. అచ్యుత దేవి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొపెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి. వాణి మాధవిలతో కలిసి ఆమె స్నాతకోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 2023, 2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలను ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసి ప్రోత్సహించనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థుల డిగ్రీల ప్రధానోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హరిచందన దాసరి ఐఏఎస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.శశికాంత్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం. సుచిత్ర, కో కన్వీనర్ డాక్టర్ కె.స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బొంగునూరి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్ నవంబర్ 12( వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో డి. పోచంపల్లి లోని ఆయన నివాసం వద్ద జనం మెచ్చిన నాయకుడు అలుపెరుగని ప్రజా సేవకులు పేద ప్రజల ఆశాజ్యోతి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి అంగరంగ వైభవంగా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,కోలన్ హన్మంత్ రెడ్డి,మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలం గౌడ్,బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళల,అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను అందజేసిన నియోజకవర్గం ప్రజలు

కుత్బుల్లాపూర్ నవంబర్ 12( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గం ప్రజలు పలు ఆహ్వానాలను అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజకు ఆహ్వానిస్తూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు & ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆహ్వానము...



కుత్బుల్లాపూర్ నవంబర్ 12( వాయిస్ టుడే): ఎమ్మెల్సీ శంభీపూర్ కార్యాలయంలో, ఎమ్మెల్యే కార్యాలయంలో నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కు చెందిన శ్రీనివాస్ నగర్ శ్రీ ధర్మ శాస్త్ర ఆలయ ఛైర్మెన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ %ఴ% మాజీ కౌన్సిలర్ అర్కల అనంత స్వామి,సీనియర్ నాయకులు రమేష్, నాయకులు దశరథ్, రవి, బ్యాగారి యాదగిరి మరియు వారి కుమారుడు బ్యాగారి వివేక్ (కన్నె స్వామి) వారు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద కలిసి నిజాంపేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద రేపు అనగా 13-11-2025 సా ఎం06:00 గంటలకు జరిగే అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమనికి ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందచేశారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ (వాయిస్ టుడే): గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

తార్నాక హనుమాన్ నగర్ నుంచి నాచారం వెళ్లే మార్గంలో విజయ డెయిరీ క్వార్టర్స్ వద్ద ఓ వ్యక్తి పడి ఉండానికి అటువైపుగా వెళుతున్న సుభాష్ అనే వ్యక్తి 100 కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో తార్నాక ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. దాదాపు 45 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వ్యక్తి చనిపోయి పడి ఉన్నట్లు గుర్తించారు. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైట్ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు.




## బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలి

కాచిగూడ,నవంబర్ 12: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారంలో జరిగే పార్లమెంట్ సీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించి రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్ లో చేర్చాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీలను పూర్తిగా విస్మరిస్తున్నాయని, దీంతో బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలందరూ పార్టీలకతీతంగా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదిని అఖిల పక్షంతో కలిసి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నేతలు భూషణ్ భాస్కర్, పి. కృష్ణ, ముత్యాల్ రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్ కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రాణాలు పోతే ఎవరు బాధ్యులు..?



శేరిలింగంపల్లి, నవంబర్ 12 (వాయిస్ టుడే): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఉట్టి పడుతోంది. బిల్ పేమెంట్ కు లాస్ట్ డేట్ దాటిందంటే చాలు ఏది ఏమైనా సరే బిల్లు కట్టాల్సిందే అంటూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. కానీ అధికారులు మాత్రం బాధ్యత నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి కాలనీ, డీ పార్క్ వద్ద ఉన్న 100 కిలో వాట్స్ ట్రాన్స్ఫారం కింది భాగాన అమర్చిన ఫ్యూజ్ బాక్స్ తెరిచి ఉండడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గ్రౌండ్ లెవెల్ నుండి కేవలం రెండు అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఫ్యూజ్ బాక్స్ ను పిల్లలు, పెద్దలు లేదా మూగజీవులు పొరపాటున తాకితే పరిస్థితులు ఊహించలేం. ఇటీవలే ఓ పిల్లి ఫ్యూజ్ బాక్స్ లోకి దూరడంతో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ కారణంగా డీ పార్క్ పరిసర ప్రాంతాలలో కరెంటు లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఫ్యూజ్ బాక్స్ కు కవర్ ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



## అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, నవంబర్ 12 (వాయిస్ టుడే): చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్ లో జి.శ్రీకాంత్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. పూజ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వామివారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామివారి కృప, చల్లనిచూపు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ జి.రవీందర్ రావు, సీనియర్ నాయకులు మిరియాల రాఘవ రావు, సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, యువ నాయకులు మిరియాల ప్రీతం, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## ఇండియా క్రికెట్ జట్టుకి హైదరాబాద్ కుర్రోడు

లకిడికపూల్ : నవంబర్ 12 ( వాయిస్ టుడే ) హైదరాబాద్ నుండి యువ క్రికెటర్ అండర్ 19 ఇండియా టీంలోకి ఎంట్రీ ఇచ్చాడు. నాంపల్లి మల్లెపల్లికి చెందిన మహమ్మద్ మాలిక్ ను బీసీసీఐ అండర్ 19 ఏ టీమ్ లో అవకాశం కల్పించింది. ఇటీవల బిసిసిఐ నిర్వహించిన అండర్ 19 వినూ మాంకడ్ ట్రోఫీలో హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ మాలిక్ టాప్ వికెట్ టెకర్ గా నిలవడంతో ,.. ఈ అవకాశం దక్కింది. దీనితో అతని తండ్రి మహ్మద్ అబ్దుల్ సుబాన్ ఆధ్వర్యంలో లక్డికపుల్ లో మ్యాగ్నెట్ ఇన్ఫ్రా సంస్థ కార్యాలయంలోని సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి , టపాసులు పేల్చి సంబరాలు చేశారు. ఇండియన్ పాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ ప్రేరణతో ప్రాక్టీస్ చేసి , అండర్ 19 టీమ్ కు సెలెక్ట్ అయినట్లు మహమ్మద్ మాలిక్ తెలిపారు. ఈ నెల 17న బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్తాన్ తో జరగనున్న సిరీస్ లో పాల్గొననున్నట్లు మాలిక్ అన్నారు. భవిష్యత్తులో ఇండియన్ టీమ్ కు ప్రాతినిధ్యం వహించడం తన డ్రీమ్ అని... ఆ దిశగా తాను మెరుగైన ప్రదర్శన ఇస్తానని మాలిక్ స్పష్టం చేశారు. తాను కూడా క్రికెటర్ నేనని...ఇండియా టీం కి ఆడాలనే కోరిక తన కొడుకు ద్వారా నెరవేరిందని తండ్రి మామ దబ్దుల్ సుభాన్ తెలిపారు. తాను కూడా క్రికెటర్ నేనని... ఇండియా టీం కి ఆడాలనే కోరిక తన కొడుకు ద్వారా నెరవేరిందని తండ్రి మహమ్మద్ అబ్దుల్ సుభాన్ తెలిపారు.



పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిగణేష్ కాలనీలో ఫణీంద్రరెడ్డి స్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో మాదిరి ప్రిథ్వీరాజ్ పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. – (వాయిస్ టుడే న్యూస్) పటాన్ చెరు

## సుల్తాన్ పూర్ బాహ్య వలయ రహదారి సర్వీస్ రహదారి వద్ద రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అమీన్ పూర్ పోలీసులు




హైదరాబాద్ కాటేదాన్ నుంచి గుజరాత్ కు అక్రమ రవాణా చేస్తుండగా 34.96 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు . లారీ డ్రైవర్ నుంచి రాజ బాయ్, కన్నా రాజ బాయ్ లను అదుపులోకి తీసుకున్న పోలీసులు. వీరితో పాటు ఇందులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

## దుకాణానికి వెళ్లిన యువకుడు అదృశ్యం



కంటోన్మెంట్: నవంబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): దుకాణానికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన మారేడ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎరుకల బస్తీలో నివాసం ఉండే మోహన్ రావు అనే వ్యక్తి వాచ్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 5 న అతని కుమారుడు వంశీ దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. మానసిక వికలాంగుడిగా ఉన్న వంశీ ఇంట్లో నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమకు తెలిసిన బంధువుల స్నేహితుల ఇళ్లలో ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో మారేడుపల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

### రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే నవంబర్ 12: బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ లక్ష్మీ,ఎస్సై రవి సిబ్బంది పాల్గొన్నారు.

## మూతబడిన పాఠశాలల స్థలాల హక్కుదారులు ఎవరు?

రామకృష్ణాపూర్ నవంబర్ 12 (వాయిస్ టుడే): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మూతబడిన పాఠశాలల స్థలాలకు హక్కుదారులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకి వెళితే క్యాతనపల్లి మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న తరుణంలో కొన్ని వేల జనాభా కలిగిన సమయంలో అధిక శాతం కార్మికులు ఇంకా కొంతమంది కార్మికేతరులు నివసించేవారు. విద్యార్థుల చదువుల నిమిత్తం గవర్నమెంట్, సింగరేణి పాఠశాలలు మాత్రమే వాడుకలో ఉండేవి. పెరిగిన జనాభా, విద్యార్థుల అవసరాల దృష్ట్యా ఊరి అభివృద్ధి కోసం ప్రైవేట్ పాఠశాలలకు సింగరేణి సంస్థ స్థలాలను కొన్ని సంవత్సరాలకు లీజుకు ఇవ్వడం జరిగింది. కాలక్రమేనా సింగరేణి బొగ్గు బావులు మూతపడడంతో సింగరేణి కార్మికులు మరొక ప్రాంతానికి తరలి వెళ్లిపోయారు. ఇంగ్లీష్ మీడియం కారణంగా తెలుగు విద్యాసంస్థలకు నష్టం వాటిల్లి పాఠశాలలను మూసివేసిన పరిస్థితి నెలకొంది. మేజర్ గ్రామపంచాయతీ నుండి క్యాతనపల్లి మున్సిపాలిటీ గా మారడం, సింగరేణి సంస్థ పాఠశాలలకు ఇచ్చిన లీజు గడువు ముగియడంతో కొన్ని పాఠశాల స్థలాలను ప్రభుత్వానికి అప్పగించేశారని విషయం తెలుసుకున్న అప్పటి పాఠశాలల నిర్వహకులు 76 జీవో ప్రకారం సింగరేణి ఇండ్లకు పట్టాలు అందజేసిన విధంగా ఎలా అయినా ఈ స్థలాలను తమ సొంతం చేసుకోవాలి అనే దురుద్దేశ్యంతో కొందరి రాజకీయ నాయకులను ముందువరుసలో పెట్టి వారి ప్రమేయంతో అధికారులను మచ్చిక చేసుకుని శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను చూపించి ఖాళీ స్థలాలకు అక్రమంగా ఇంటి నెంబర్లను కేటాయించుకున్నారు. ధనార్జనేధ్యేయంగా పట్టాదారుల అవతారం ఎత్తిన పాఠశాల నిర్వహకులు, వారికి సహకరిస్తున్న రాజకీయ నాయకులు పూర్తి స్థలాలను అమ్మకముందే సింగరేణి అధికారులు, ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి విలువైన ఆస్తులను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఓయూలో అవగాహన కార్యక్రమం



హైదరాబాద్, నవంబర్ 12 :(వాయిస్ టూ డే): విదేశీవిశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆశయంతో ఉన్న విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి స్టడీ అబ్రాడ్ ఫేర్ 2025 ను బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (HCDC), గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం (GECF) సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ కళాశాల, గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ జి. విజయ చరణ్, డైరెక్టర్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (%ుజణజ%), డాక్టర్. సూర్యవల్లి, కోఆర్డినేటర్, HCDC శ్రీలక్ష్మీ నారాయణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, GECF ఈ కార్యక్రమంలో పాల్గొనీ ప్రసంగించారు. ప్రొఫెసర్ జి. విజయ చరణ్ హెచ్సిడిసి నిర్వహిస్తున్న వివిధ శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, కెరీర్ అవగాహన కార్యక్రమాలు విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగినవారిగా తీర్చిదిద్దడంలో ఎంతగానో సహాయపడుతున్నాయని వివరించారు. ఈ ఫేర్ విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న విభిన్న కోర్సులను తెలుసుకొని, తమ భవిష్యత్తు విద్యా నిర్ణయాలను సమర్థవంతంగా తీసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఫేర్ ఇంటర్న్‌షిప్‌లు, ఫుల్ టైమ్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడానికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్మీ నారాయణ్ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ విద్యకు సిద్ధం కావడంలో ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రతినిధులతో చురుకైన పరస్పర సంభాషణ చేయాలని విద్యార్థులను కోరారు. ప్రొఫెసర్ కుమార్ మోలుగారం మాట్లాడుతూ విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. గ్లోబల్ ఎక్స్పోజర్ ప్రస్తుత కాలంలో అత్యవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న వివిధ అండర్‌గ్రాడ్యుయేట్, నిచ్ కోర్సులను, ముఖ్యంగా వ్యవసాయం, ఉద్యానవన శాస్త్రం, ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ వంటి రంగాలలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ ఫేర్ ద్వారా విద్యార్థులు నేరుగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సంభాషణ జరిపి, ఉన్నత విద్యా మరియు స్కాలర్‌షిప్ అవకాశాలను తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ దేశ ప్రతినిధులతో సంభాషణ జరిపి, అంతర్జాతీయ సహకార కార్యక్రమాలను బలోపేతం చేసే దిశగా చర్చించారు. అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ వంటి ఇతర దేశాల నుండి1000కు పైగా విద్యార్థులు ఈ ఫేర్‌కి నమోదు చేసుకున్నారు. 30కి పైగా విశ్వవిద్యాలయాలు ఈ ఫేర్‌లో పాల్గొన్నాయి.





## సురక్షిత మంచినీటి కేంద్రం ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే నవంబర్ 12: నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, పాల్వంచ తన సామాజిక కార్యక్రమాలలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రం –శేఖర బంజర్ నందు సురక్షిత మంచినీటి కేంద్రం (100 ఎల్ పి హెచ్) సబ్మెర్సిబుల్ మోటార్ ఏర్పాటు చేసిన సందర్భంగా, ఈ కారక్రామానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ తుకారాం రాథోడ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా నీటి సదుపాయాలు లేక వైద్య కేంద్రంకు విచ్చేసినటువంటి రోగులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఆ విషయం ' నవ లిమిటెడ్ ' యాజమాన్యం దృష్టికి తీసుకొని వెళ్లగా సత్వరమే సురక్షిత మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారని అలాగే ఈ సురక్షిత మంచినీటితో రోగాలు చాలా వరకు నివారణ అవుతాయాని తెలిపారు.

ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ ఇప్పటిదాక పనిచేసిన వేరే జిల్లాలలో ఏ కార్పొరేట్ సంస్థ ప్రభుత్వ వైద్య కేంద్రంకు ఇలాంటి మంచి కార్యక్రమములు చేయడం చూడలేదని 'నవ ' గ్రూప్ కృషిని ఆయన కొనియాడారు. జనరల్ మేనేజర్. సి. యస్. ఆర్ ఎమ్ జి ఎమ్ ప్రసాద్ మాట్లాడుతూ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి రామవరం తల్లి పిల్లల వైద్య కేంద్రమునకు ఆక్సీజన్ పాయింట్స్ ఏర్పాటు చేశామని అలాగే ఈ సంవత్సరము పాల్వంచ ప్రభుత్య ఆసుపత్రికి రోగుల కోసం వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమనికి నవ లిమిటెడ్ ప్రతినిధి డి జి యం (హెచ్ ఆర్) శ్రీనివాస రెడ్డి, శేఖర బంజర గ్రామ పెద్ద బాలు నాయక్, కిషోర్, గాంధీనగర్ గ్రామ పెద్దలు రాము, లాలు, శంకర్, కిషన్, సి యస్ ఆర్ సిబ్బంది రాజేష్, వెంకన్న, బాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి డి ఆర్ డి ఓ విద్యా చందన



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే నవంబర్ 12: సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి అని, సంఘం తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డిఆర్డివో విద్యా చందన అన్నారు. జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో సీనియర్ సి ఆర్ పి స్ట్రాటజీ కార్యక్రమం కింద జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ సంఘాలు (ఈవోస్) మండల సమాఖ్యలు (ఎమ్మెస్) పనితీరును సమీక్షించేందుకు మొత్తం 10 మంది సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సి ఆర్ పి%ం%) గత 15 రోజులుగా విస్తృత పర్యటన చేపట్టారు. గత నెల 28వ తేదీ నుండి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించిన పర్యటన అనంతరం బుధవారం ఐడి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డి ఆర్ డి ఓ డి ఆర్ డి ఏ) ఎం. విద్యా చందన పాల్గొని సి ఆర్ పి లు సమర్పించిన నివేదికలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ა "గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు తీసుకున్న బాధ్యతలను కట్టుబాట్లతో పాటిస్తూ, తీసుకున్న రుణాలను సమయానికి తిరిగి చెల్లించాలి. పుస్తక నిర్వహణను క్రమబద్ధంగా కొనసాగిస్తూ సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి. ఎక్కడా కూడా నిధుల దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి" అని సూచించారు.

సంఘ సభ్యులు శిక్షణా కార్యక్రమాల ద్వారా అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగాలని, సీనియర్ సిఆర్పిలు తగిన మార్గదర్శకతతో గ్రామ స్థాయిలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దేలా కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డి ఆర్ డి ఓ నీలేష్ జిల్లా సమాఖ్య అధ్యక్షులు సుజాత , డిపిఎం సి.హెచ్. అనూరాధ , సీనియర్ సి ఆర్ పిలు, అన్ని మండలాల ఏటీఎం లు, వి ఓ అధ్యక్షులు, సి సి లు, వివో ఏలు పాల్గొన్నారు.

# తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26న హలో విద్యార్థి చలో భద్రాచలం విద్యార్థి మహాగర్జన



హైదరాబాద్, నవంబర్ 12బీ( వాయిస్ టూ డే): తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 26న హలో విద్యార్థి చలో భద్రాచలం విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయండి ఈరోజు హైదరాబాద్ విద్యానగర్లోని టైగర్ ఆరు కృష్ణన్న ఎంపీ రాజ్యసభ నివాసం వద్ద హలో విద్యార్థి చలో భద్రాచలం పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు గురుకులాలకు సంత భవనాలను వెంటనే ఏర్పాటు చేయాలని అదేవిధంగా 8 నెలల నుండి ఎస్సీ వసతిగృహాల్లో బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వక చాలా ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు వెంటనే ఎస్సీ బీసీ ఎస్టీ ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేసి ప్రభుత్వం ఉద్యోగాలను ఆదుకోవాలని వారి డిమాండ్ చేసినారు ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాలకు సొంత భవనాలు మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరినారు ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ సోషల్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కూరేల మహేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం అలాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోని పరిస్థితుల్లో ఉన్నది కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని వసతి గృహాలకు సొంత భవనాలు గురుకులాలకు సొంత భవనాలు ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినారు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల గోస చాలా దారుణంగా ఉన్నది గా హలో విద్యార్థి చలో భద్రాచలం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముంపు మండలాలను తెలంగాణలో కలిపి విద్యార్థులకు న్యాయం చేయాలని వారి ఇబ్బందులను గుర్తించాలని వారు కోరినారు ఈ కార్యక్రమంలో తెలంగాణ టోటల్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థి నాయకులు కూరేళ్ల ఉదయ్, ధర్మారపు చంద్రశేఖర్, నాని, నాని ,శివ, సిద్దు, సాత్విక్, మోహన్, ప్రభుదాస్ ,బీసీ సంఘ నేతలు బీసీ సంఘ నేతలు నీలం వెంకటేష్ ,అంజి జిల్లా పెళ్లి తదితరులు పాల్గొన్నారు,

# సమాచారం లేకుండా అర్ధరాత్రి దర్శనాలు నిలిపివేత ఎందుకు

## - రాజన్న ఆలయ అధికారుల తీరుపై బీజేపీ నాయకుల మండిపాటు



వేములవాడ, నవంబర్ 12 (వాయిస్ టుడే) ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దర్శనాలు నిలిపివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని బీజేపీ నాయకులు దేవాలయ అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ?ఆలయం మూసివేత నేపథ్యంలో వేములవాడ బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాపరామకృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ బుధవారం ఆలయం ముందు నిలబడి మాట్లాడారు. రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ దేవాలయ అధికారులు హుటాహుటిన దర్శనాలు నిలిపివేయడం ఏంటని ప్రశ్నించారు. దర్శనాల విషయంలో భక్తులకు,స్థానిక ప్రజలకు స్పష్టమైన ప్రకటన ఇవ్వాల్సిన ఆవశ్యకత అధికారులకు లేదా అంటూ నిలదీశారు. ప్రతాపరామకృష్ణ మాట్లాడుతూ.. అభివృద్ధికి బీజేపీ పార్టీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అయితే,ఆలయాన్ని మూసివేస్తే ప్రత్యక్షంగా కానీ,పరోక్షంగా కానీ అనేక కుటుంబాలు రోడ్డున పడతాయనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ముందుగా ఆలయంలోని దర్గాను తొలగించిన తర్వాతే దేవతా మూర్తుల విగ్రహాలను ముట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రేగుల రాజకుమార్,మెరుగు లక్ష్మణ్,అన్నం నరసయ్య,పిన్నింటి హనుమాన్లు,నామాల శేఖర్,కొన్నాళ రఘుపతి,నేరెళ్ల సాయి,గుడిసె మనోజ్,లాల శేఖర్, సగ్గు రాహుల్,గుంటి కనకయ్య,జవాజీ శేఖర్,డాక్టర్ వెంకన్న నాయకులు,నేరెళ్ల కిరణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం

## బార్ కౌన్సిల్ అభ్యర్థి పొన్నం అశోక్ గౌడ్

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా నవంబర్-12 వాయిస్ టుడే: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్, తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్, పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్ గౌడ్ బుధవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. బార్ కౌన్సిల్ ఎన్నికలలో మద్దతు పలికి తనను గెలిపించాలంటూ అశోక్ గౌడ్ న్యాయవాదులను కోరారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదులకు అందించే డెత్ బెనిఫిట్ ను పదిహేను లక్షలు చెల్లించెందుకు, న్యాయవాదులకు ఆరోగ్య భీమా సౌకర్యాన్ని రెండు లక్షల నుండి ఐదు లక్షలకు పెంచడానికి, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇప్పించేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని న్యాయవాదులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి దూడం ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, న్యాయవాదులు భూసారపు బాలకిషన్ ప్రసాద్, మదూరి ఆంజనేయులు, ఆవుల లక్ష్మీ రాజం, పడాల శ్రీరాములు, జోగుల రమేష్, అవునూరి సత్యనారాయణ, కోడం అజయ్,సామల రాజేంద్ర ప్రసాద్,ఆవుల శివకృష్ణ,గుడ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు..



# సుల్తానాబాద్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## నాణ్యమైన ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా నవంబర్-12 వాయిస్ టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలకి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు రాగానే త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలంలోని చిన్న బొంకూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు నలభై ఎనిమిది గంటల లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని అన్నారు.హమాలీల సమస్య లేకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కే. శ్రీనాథ్, చిన్న కలల సీఈవో వల్లకొండ రమేష్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# శ్రీరామిరెడ్డి మరణం బాధాకరం : యార్లగడ్డ

గన్నవరం : నమ్మిన వారి కోసం కడవరకు పోరాడే మనస్తత్వం ఉన్న శ్రీరామరెడ్డి మృతి తనను తీవ్రంగా బాధించిందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఉయ్యూరు శ్రీరామ్ రెడ్డి(94) మంగళవారం రాత్రి మృతిచెందగా, బుధవారం ఉదయం వీరపనేనిగూడెం గ్రామానికి చేరుకుని శ్రీరామ్ రెడ్డి మృదేహాన్ని సందర్శించిన యార్లగడ్డ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రెడ్డితో తన గల అనుబంధాన్ని యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. శ్రీరామ్ రెడ్డి 2017 నుంచి తన వెంటే నడుస్తున్నారని యార్లగడ్డ తెలిపారు. పాలకేంద్ర అధ్యక్షుడుగా పనిచేస్తున్న శ్రీరామ్ రెడ్డి పదవి పోయినా బాధపడకుండా తనను ఎమ్మెల్యేగా చూడాలన్న ఏకైక లక్ష్యంతో తనతోపాటు పార్టీ మారారని యార్లగడ్డ పేర్కొన్నారు. గత 60 ఏళ్లుగా రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆయన 92 ఏళ్ళ వయసులో తన కోసం పార్టీ మారి గత ఎన్నికల్లో తన గెలుపు కోసం కష్టపడి పని చేసిన శ్రీరామ్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. శ్రీరామ్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన యార్లగడ్డ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, నాదిండ్ల మోహన్, వెంకటకృష్ణ, టీడీపీ నాయకులు కాగితాల నాగరాజు, బసంత్, షేక్ అమీర్, పుల్లారెడ్డి, నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.



# పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్బీ వేములవాడ

వాయిస్ టుడే న్యూస్బీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో పేద విద్యార్థులకు మెరుగైన విద్య, అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యంగా పని చేస్తున్నామని, విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు పేర్కొన్నారు. వేములవాడ మండలం లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల గురించి, మరియు విద్య యొక్క ప్రాముఖ్యత, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమనీకి రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ మర్రిపల్లి చందన తో కలిసి పాల్గొన్నారు.



# వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చి... దోపిడీకి గురైన దంపతులు

## ఆటో డ్రైవర్, మరో వ్యక్తి దౌర్జన్యంబీ 2.5 తులాల బంగారం అపహరణ

వాయిస్ టుడే న్యూస్బీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 13: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన దంపతులు ఆటో డ్రైవర్ మరియు అతని అనుచరుడి చేతిలో దారుణంగా దోపిడీకి గురయ్యారు. వారి మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని, డబ్బును అపహరించి పారిపోయారు. కామారెడ్డి జిల్లా, రామరెడ్డి మండలం, అన్నారం గ్రామానికి చెందిన దేవుపల్లి బుధవ్వ మరియు ఆమె భర్త చంద్రయ్య ఈరోజు (బుధవారం) రాజన్న దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం వారు నాంపల్లి టెంపుల్కు వెళ్లడానికి తిప్పాపూర్ నుండి ఆటోలో ఎక్కారు. ??ఆటో డ్రైవర్, మరో వ్యక్తి కలిసి నాంపల్లి వైపు కాకుండా ఆటోను మరోవైపు తీసుకువెళ్లారు. అక్కడ ఆ దంపతులను "చంపుతాము" అని బెదిరించి, బుధవ్వ మెడలోని 2.5 తులాల బంగారు పుస్తెలతాడు మరియు రూ. 2,000 నగదును లాక్కొని పారిపోయారు. ?ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై రామ్మోహన్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు నిందితులను గుర్తించి పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఢిల్లీలో ఉగ్ర దాడులను ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా నవంబర్-12 వాయిస్ టుడే: ఢిల్లీ ఎర్రకోటలోని మెట్రోరైల్వే సమీపంలో చోటు చేసుకున్న కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ దారుణ సంఘటనను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ సుల్తానాబాద్ బిజెపి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు అధ్యక్షతన మున్సిపాలిటీలోనిఅంబేద్కర్ చౌరస్తా వద్ద తీవ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేసి, మరణించిన వారికి నివాళి అర్పిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈసందర్భంగా పెద్దపెల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు మాట్లాడుతూ, ఈఘటనలో ప్రాణాలు కోల్పోయిన నిరపరాధుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని తెలిపి, బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందిస్తుందని గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. దేశ భద్రతను దెబ్బతీసే ప్రయత్నాలు ఎంత మాత్రం సహించరాదని, ఈ నరమేధానికి పాల్పడిన వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టి కఠినమైన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి పేలుళ్ల వెనుక కుట్ర దాగి ఉందని, భారతీయ జనతా పార్టీని మానసికంగా దెబ్బతీయాలనే ప్రయత్నంగా ఇది కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజల ఐకమత్యాన్ని దెబ్బ తీయాలనే ప్రయత్నాలు విఫలమవుతాయని, బీజేపీ ఎప్పటికప్పుడు దేశ భద్రత, ప్రజల శాంతి, ఐక్యత కోసం కట్టుబడి ఉంటుందని కడారి అశోక్ రావు స్పష్టం చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణలో భాగ స్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము తిరుపతి యాదవ్, లంక శంకర్, వేగోలపు శ్రీనివాస్ గౌడ్, కామని రాజేంద్రప్రసాద్, ఎగోలపు సదయ్య గౌడ్, ఉషన అన్వేష్, నాగుల మల్యాల తిరుపతి, గజభింకర్ పవన్, ఎనగందుల సతీష్, పల్లె తిరుపతి, భూసారపు సంపత్,కందునూరీ కుమార్, గుడ్ల వెంకటేష్, సంతోష్ రెడ్డి, మహేష్ పటేల్, పంతంగి శ్రీకాంత్, శేఖర్ మాస్టర్, వేముల శ్రీనివాస్, కోయల్కర్ నాగరాజు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# భక్తిశ్రద్ధలతో కురుమూర్తి స్వామి దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా నవంబర్ 12 : (దేవరకద్ర ) కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్స్యకారుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి , అయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కురుమూర్తి రాయుడిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వాదాలతో తీర్థప్రసాదం తిరస్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు గోనెల శ్రీనివాసులు, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం కోసం గళం వినిపించిన మహాకవి అందెశ్రీ

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల జిల్లా అధ్యక్షుడు గూగు లోతు రాంబాబు నాయక్

వాయిస్ టుడే ప్రతినిధి నవంబర్ 12 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్ట ణంలో ఈరోజు విలేకరుల సమావేశంలో రాంబాబు నాయక్ మాట్లాడుతూ మనం మన తెలంగాణ రాష్ట్రం సాధనకై ఎంత మంది పోరాటం చేసిన చివరిగా కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ నాయకత్వం తెలంగాణ రాష్ట్రం సహకారం అయినదని కాంగ్రెస్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 మంది ముఖ్యమంత్రులను చూశాం కానీ నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి అని స్థాయిని మరిచిపోయి ఒక సామాజిక తెలంగాణ సాధనకై సహకరించిన కవి గాయకులు అందెశ్రీ పాడే మోసి యావత్ తెలంగాణ ప్రజలకు ఒక ఆలోచనను ఒక విజ్ఞానాన్ని తెలియపరిచారన్నారు.మనం గత పాలకులను చూశాం కానీ సామాన్య వ్యక్తగా పేదల పాలిట పెద్దదిగా రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామికంగా మనందరికీ అర్థమే రీతిలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో పేదల పక్షాన రాష్ట్రం కోసం ఒక గేయ రచయిత చెరగని ముద్ర రచించిన అతనికి జీవితాంతం తెలంగాణ ప్రజలు గుర్తించుకునే ఒక చరిత్రని రాసినటువంటి వారు కవి గాయకులు తెలంగాణ జాతీయ గీతాన్ని పుస్తకాల్లో ప్రచురించాలని ఆదేశించినటువంటి ఘనుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. అంతేకాకుండా వారి సేవలను గుర్తు చేస్తూ వారి కుటుంబంలో ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తూ వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారని,గతంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కవి కళాకారులు గాయకులు ఎంతోమంది రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన వారిని గత ప్రభుత్వ వారు అధికారులు ప్రజాప్రతినిధులు మర్చిపోయిన వారిని గుర్తించి వారిని సన్మానించి మరొక్కసారి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల పక్ష నాయకుడుగా తన సత్తా చాటుకోవడం జరిగిందన్నారు. యావత్తు తెలంగాణ ప్రజలు ఇది గమనించాలని కోరారు. మనందరి మనసులో మనందరి అడుగుజాడలో మనందరి సేవా కార్యక్రమంలో మనం మన రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకొని ముందు ముందు అందరికీ ఇలాంటి కార్యక్రమాలు చేసుకుంటూ గుర్తింపు తీసుకొస్తాయని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

# కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి

- దంప్ యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయాలి
- అన్ని అమ్మకాలు రైతు బజార్లో జరగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12 (వాయిస్ టుడే): సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలి. మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న దంపింగ్ యార్డ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. దంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

**రైతు బజార్‌లోనే విక్రయాలు చేయాలి**

సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో ఇక్కడే చేసేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతల పరిరక్షణకు ఏసిపి కార్యాలయంలో రివ్యూ మీటింగ్

**శాంతి భద్రతలపై అధికారులతో చర్చించిన ఏసిపి సదానందం**

హుస్నాబాద్ వాయిస్ టుడే ప్రతినిధి నంబర్ 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏసిపి కార్యాలయంలో క్రైమ్ రివ్యూ మీటింగ్ ను ఎసిపి సదానందం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న కేసుల విషయమై హుస్నాబాద్ సర్కిల్ సిఐ శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్సై లతో మాట్లాడి చర్చించారు. దొంగతనాలను అరికట్టడం, శాంతి భద్రతల పరిరక్షణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.



## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

**ఎస్ఐ బండి మోహన్ బాబు**

హుజూర్ నగర్ నవంబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని హుజూర్ నగర్ పట్టణ ఎస్ ఐ బండి మోహన్ బాబు అన్నారు.బుధవారం మండల పరిధిలోని గోపాలపురంలో కోదాడ జడ్చర్ల రహదారిపై బూరుగడ్డ వెళ్లే రహదారి క్రాసింగ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన(స్టాఫ్ బోర్డులు) బారికేడ్లను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఎస్ ఐ మోహన్ బాబు మాట్లాడుతూ స్టాప్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు వేగం తగ్గి నెమ్మదిగా వెళ్తాయని పాదాచారులకు ఇబ్బందులు తోలుగుతాయన్నారు. అంతేకాకుండా వాహనదారులు అతివేగంతో ప్రయాణించకుండా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అదేవిధంగా వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐ బాలరాంరెడ్డి, పలువురు కానిస్టేబుళ్ళు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజులుగా కరెంటు, నీళ్లు లేక విద్యార్థుల అవస్థలు

**అధికారుల నిర్లక్ష్యం హరి గోస పడుతున్న విద్యార్థులు**



వాయిస్ టుడే ప్రతినిధి నవంబర్ 12 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో గత వారంరోజుల నుండి విద్యుత్ లేక అవస్థ పడుతున్న విద్యార్థులను బుధవారం రోజున ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహమును బిజెపి గ్రామీణ మండల అధ్యక్షులు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో సందర్శించ్చారు. ఈ సందర్బంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత వారం రోజుల నుండి వసతి గ్రహములో కరెంటు లేక స్నానం చేయడానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నారని కనీసం విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిచడం లేదని విద్యార్థినిలు చెప్తున్నారని ఆరోపించారు.ఇట్టి విషయమై హాస్టల్ వార్డెన్ గాయత్రిని వివరణ కోరగా విద్యుత్ రిపేర్ చేపిస్తే ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదన్నారు.ప్రభుత్వం కాంట్రాక్టర్ కు ఇస్తుందని మేము ఎందుకు చేపిస్తామని కాంట్రాక్టర్ తొ చేయిస్తామని తెలిపారని వెంటనే డిటిడిఓని ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదన్నారు.వెంటనే వెంటనే విద్యుత్ రిపేర్ చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్ గిరిజన నాయకులు మోహన్ నాయక్ బొల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బై పోల్ ఫలితాలతో బిఆర్ఎస్ దుకాణం బంద్

**విద్వేష ప్రసంగాలతో డిపాజిట్ కోల్పోనున్న బిజెపి**

**కాంగ్రెస్ నాయకులు దొంతి గోపి**



కరీంనగర్,నవంబర్ 12(వాయిస్ టుడే):గత 9 ఏళ్ల పాలనలో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థి గెలుపు కోసం నగదు,మద్యం ఏరులై పారించినప్పటికీ,అభ్యర్థి ఎంపికలో తన రాజకీయ అనుభవాన్ని ప్రదర్శించిన హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహానికి తోడు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,కార్పొరేషన్ చైర్మన్ల కార్యకర్తల విస్తృత స్థాయి ప్రచారంతో పాటు అభివృద్ధిని కాంక్షించే వారు విజ్ఞతతో ఓటు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని స్వీకరించిన జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించనున్నారని పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు నిరూపించాయని కాంగ్రెస్ నాయకుడు దొంతి గోపి పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు ఇతర నేతలు రంగంలో దిగి,ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్ని పన్నాగాలు పన్నినప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ పార్టీనీ నమ్మలేదని, ఈ ఎన్నిక ఫలితాలతో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని స్పష్టం అవుతుందని ఇక కేటీఆర్ ముల్లె మూటా సర్దుకుని ఎక్కడి నుండి వచ్చారో అక్కడికే చేరుకునే సమయం ఆసన్నమైనదని ఎద్దేవా చేశారు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ద్వారా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని స్పష్టమైందని,ఇక భవిష్యత్తులో ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్ పార్టీ దేనని సంపూర్ణ ధీమా వ్యక్తం చేస్తున్నామన్నారు.



## వాహనాలను ఆకస్మిక తనిఖీ చేసిన మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రజనీ దేవి

**పలు వాహనాలు సీజ్**

**నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు**

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి నవంబర్ 12: మోటారు వాహనాల సహాయక తనిఖీ అధికారి రజనీ దేవి బోయినపల్లి మండల కేంద్రంలో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టి వివిధ వాహనములకు సంబంధించిన సరియగు పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. బోయినపల్లి కొదురుపాక మధ్యలో గ్రానైట్ క్వారీతోపాటు గూడ్స్ వాహనాలు ఇసుక ట్రాక్టర్లను ఆపి ధ్రువపత్రాలను పరిశీలించారు.ఇట్టి తనిఖీల్లో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా వాహనంలకు చెల్లించాల్సిన పన్ను,బీమా, ఫిట్నెస్ కండిషన్, పర్మిషన్,పొల్యూషన్, లైసెన్సులు తమ వెంట ఉండేట్టు చూసుకోవాలని తెలిపారు. టాక్స్ కట్టని వాహనంలకు తనిఖీలో భాగంగా రవాణా శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేస్తే 200 పర్సెంట్ అదనపు రూపాయలు చెల్లించవలసి వస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రయాణికులను సీట్లకు మించి అధికంగా తీసుకెళ్లొద్దని, సరుకు రవాణాకు సంబంధించిన వాహనాలు అధికలోడు తీసుకువెళ్లద్దని,వాహనయజుమానులకు సూచించారు.



## ఇండ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం

**కాలనీవాసుల ఆందోళన**

కరీంనగర్,నవంబర్ 12(వాయిస్ టుడే):కరీంనగర్ కార్పొరేషన్ 14వ డివిజన్ బృందావన్ కాలనీ ప్రజల వ్యతిరేకతను తుడిచిపెట్టి ఇండ్ల మధ్యలో అక్రమంగా సెల్ టవర్ నిర్మాణం కొనసాగుతుండటంతో స్థానికుల్లో ఆగ్రహం చెలరేగింది.రాత్రి అర్ధరాత్రి వేళల్లోనే పోలీసుల రక్షణలో పనులు సాగుతుండగా,రేడియేషన్ భయంతో చిన్న పిల్లల నుంచి వృద్ధులదాకా కాలనీ వాసులు అనారోగ్య సమస్యలతో ఆందోళనలో ఉన్నారు.కలెక్టర్,మున్సిపల్ కమిషనర్,పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసహనం పెరిగింది.ఈ పరిణామాలపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా కాలనీని సందర్శించి,టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని,ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు తీసుకోవాలని అధికారులను గట్టిగా హెచ్చరించారు. కరీంనగర్ టౌన్ 14వ డివిజన్‌లో ప్రజా అభిప్రాయానికి వ్యతిరేకంగా ఇండ్ల మధ్యలో అర్ధరాత్రి అక్రమంగా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని,కాలనీ వాసులు పలుమార్లు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్,పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో,ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.అధికారులు చర్యలు తీసుకోకపోతే టీఆర్పీ పార్టీ ప్రజలతో కలిసి ఉద్యమం ప్రారంభిస్తుంది.రేడియేషన్ ప్రమాదం వల్ల పిల్లల ప్రాణాలకు ముప్పు కలిగే పరిస్థితి వస్తే,దానికి ప్రభుత్వం, అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పార్టీ జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ,జిల్లా కార్యదర్శి చాంద్ పాషా,యూత్ జిల్లా అధ్యక్షులు రాకేష్,ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, టౌన్ అధ్యక్షులు అర్షత్ బిన్ అలీ,ప్రధాన కార్యదర్శి రమేష్,జెడగల శ్రీనివాస్, వాజిద్,స్వదేశ్,సోషల్ మీడియా కరీంనగర్ జిల్లా కన్వీనర్ మహబూబ్ పాల్గొన్నారు.

## పోలంపల్లిలో బండి సంజయ్ సైకిల్‌ల పంపిణి



తిమ్మాపూర్,నవంబర్ 12(వాయిస్ టుడే): పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ ఉచితంగా ఇస్తున్నటువంటి సైకిల్ లను బుధవారం పోలంపల్లి పాఠశాలలో పంపిణి చేశారు.స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి మండల అధ్యక్షులు జగదీశ్వర చారి మాట్లాడుతూ సైకిల్ లే కాకుండా 10 వ తరగతి వారి పరీక్షల ఫీజులను కూడా కేంద్ర మంత్రే చెల్లించడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు.సైకిల్ లతో పాటుగా విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లిస్తున్నటువంటి కేంద్ర మంత్రి బండి సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, ఉపాధ్యాయ సిబ్బంది,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,ఉపాధ్యక్షులు వొద్నాల రవీందర్,పడాల శ్రీనివాస్ గౌడ్,పడాల సారయ్య,రాపర్తి రవీందర్,బుడిగే మహేష్,బుడిగే నరేష్,కాశవేణి రాజు,పచ్చిమట్ల మల్లయ్య, పడాల తిరుపతి,రేగూరి సుగుణాకర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రెడ్డి మల్లయ్య పాల్గొన్నారు.



## నవంబర్ 14 నుండి నిరాహారదీక్షలు

**ఇండ్లు పంపిణీ అయ్యేవరకు పోరాటం ఆగదు**

తొర్రూరు, నవంబర్ 12 వాయిస్ టుడే : తొర్రూర్‌లో నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంచాలని ఈనెల 14వ తేదీ నుండి తొర్రూర్ పట్టణ కేంద్రంలో జరిగే సామూహిక రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజయ్య పిలుపునిచ్చారు. బుధవారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులోని డబల్ బెడ్ రూమ్ ల దగ్గర జరిగే నిరసన కార్యక్రమానికి రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజయ్య మాట్లాడుతూ తొర్రూరు మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని గత 7 నెలలుగా పోరాటాలు చేస్తున్న కూడా, ప్రభుత్వం కానీ, అధికారులు గానీ స్పందించకుండా ఉండడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి అయి 4 సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ కూడా ఇండ్లు పంపిణీ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇండ్లు పంపిణీ చేయాలని దశలవారీగా అనేక రూపాల్లో పోరాటాలు చేసినప్పటికీ కూడా స్పందన కరువైందని అన్నారు. అధికారులు గాని ఎమ్మెల్యే గాని స్పందిస్తూ ఇండ్లు పంపిణీ చేస్తారు అని ఇన్ని రోజులు ఎదురుచూశారు. ఎక్కడ స్పందన రాకపోవడంతో తొర్రూర్ లో ఉన్నటువంటి లబ్ధిదారులందరినీ కలుపుకొని సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్షలు నవంబర్ 14వ తేదీ శుక్రవారం రోజు నుండి తొర్రూర్ లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ అమరవీరుల స్థూపం దగ్గర నిర్వహిస్తున్నాం. ఈ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు సామాజిక సంఘాలు వ్యాపార వర్గాలు మేధావులు అందరు కూడా సంఘీభావం తెలిపి ఈ పేదల సమస్యను ప్రభుత్వానికి గుర్తుకు వచ్చేలా ఈ దీక్షలు సహకరించాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, మండల కమిటీ సభ్యులు డోనుక దర్గయ్య, పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి అమీర్, సీపీఎం పార్టీ సభ్యులు కొమ్మనబోయిన పుష్ప, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట కమిటీ లీడర్లు శోభ, అరుణ, వరలక్ష్మి, అమీనా, షామీనా, శ్రీరంగం రాధా రామకృష్ణ, భవాని, రేణుక, మంజుల, గడ్డల స్వరూప సాయిలు, నరేష్ ,కృష్ణ, ధర్మయ్య , మురళి, శోభ , భాగ్య, లక్ష్మి , మమతా, రమ, గౌసియా, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.




## మాస్టర్ ఆఫ్ లా లో గోల్డ్ మెడల్ అందుకున్న కలకోల అనిల్

**ముఖ్యఅతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి**

హనుమకొండ జిల్లా: వరంగల్ జిల్లాకు చెందిన కలకోల అనిల్ ఢిల్లీ లోని ఇంటర్నేషనల్ లా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చదువును పూర్తి చేసిన సందర్భంగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్,హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ ఆషీమ్ కుమార్ ఘోష్ లు హాజరయ్యారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల కష్టం, ఉపాధ్యాయులు, స్నేహితుల సహకారంతో గోల్డ్ మెడల్ అందుకున్నట్టు తెలిపారు. తమ బిడ్డ అత్యున్నత స్థానానికి చేరుకొని గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా అనిల్ తల్లిదండ్రులు సంతోషంతో ఉప్పొంగిపోయారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం, 13 నవంబరు 2025





# రాజన్న ఆలయ అభివృద్ధికి సహకరించండి

**- 150 కోట్లతో ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ, నవంబర్ 12 (వాయిస్ టుడే): దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. 150 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులను అకస్మాత్తుగా తనిఖీ చేసిన విప్, అధికారుల నుంచి పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయాభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన నిధులను మంజూరు చేశారని చెప్పారు. శృంగేరి జగద్గురు విధిశేఖర భారతి స్వామివారి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇటీవల స్వామివారు స్వయంగా వచ్చి ఆలయ పరిశీలన చేసి పలు సలహాలు ఇచ్చారని గుర్తుచేశారు.ఆలయ నిర్మాణ పనుల కారణంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్వామివారి కళ్యాణం, కోడే కుంకుమ పూజ, సత్యనారాయణ వ్రతం వంటి అన్ని సేవలు అక్కడ నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.రాజన్న ఆలయం ఎదుట ఉన్న రావిచెట్టు వద్ద భక్తులకు దర్శన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.ప్రజల, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాభివృద్ధి జరుగుతోందని, అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు.రాజన్న భక్తులు,వేములవాడ ప్రజలు,తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.



## హనుమకొండ రాంనగర్‌లో దొంగల హల్ చల్!

**బంగారం, నగదు ఎత్తుకెళ్లినదొంగలు**

హనుమకొండ, వాయిస్ టుడే: నగరంలో చైన్ స్నాచర్ లు చైన్ స్నాచింగ్ లతో ప్రజలను ముప్పతిప్పలు పెడుతుండగా మరోవైపు పట్టపగలే దొంగలు ఇళ్లల్లోకి చొరబడి దొరికినంత దోచుకొని పరారవుతున్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ ప్రాంతంలో దొంగల ముఠా హల్ చల్ సృష్టించింది. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. రాంనగర్ ప్రాంతానికి చెందిన మూడెడ్ల కుమార్ స్వామి రైల్వే ఉద్యోగి కాగా, ఆయన భార్య రజిత అంగన్‌వాడీ టీచర్ గా ఉద్యోగాలు చేస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఇద్దరూ డ్యూటీకి వెళ్లగా సాయంత్రం 6 గంటలకు విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రజిత తాళం పగలగొట్టబడినట్లు గమనించి వెంటనే సుబేదారి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్ క్లూస్ టీం తో సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. తమ బెడ్ రూం బీరువాలో ఉన్న సుమారు పది తులాల బంగారం,50వేల నగదును దుండగులు అపహరించినట్టు ఇంటి యజమానులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద మరియు కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని కోరారు. జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని..క్లూస్ టీమ్ సిబ్బంది ఆధారాలను సేకరిస్తున్నారని,భాధితులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఆయుధాల మాట..వాయిదానే..!



దేవరకొండ: చందంపేట మండలం గువ్వలగుట్టలో అటవీ భూములను కొందరు గ్రామస్థులు దున్నుతుండడంతో అధికారులు అడ్డుకొని దస్త్రాలు చూపించాలన్నారు. దీంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఘటనలో కొందరు గ్రామస్థులు రాళ్లు, కర్రలతో దాడులు చేయడంతో ఉద్యోగులు గాయపడ్డారు. ఈ పరిస్థితి ఇక్కడే కాదు ఆదిలాబాద్, భద్రాచలం తదితర అటవీ ప్రాంతాల్లో అధికారులపై దాడులు జరుగుతూ.. గాయాలపాలవుతున్నారు. అమూల్యమైన అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడే క్రమంలో విధి నిర్వహణ అధికారులకు కత్తిమీద సాములా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ ప్రాంతాల్లో కబ్జాలను అరికట్టాలన్నా, కలప అక్రమ రవాణాను నియంత్రించాలన్నా సిబ్బంది రక్షణలా నిలుస్తున్నారు. కొందరు వ్యక్తులు నేతల అండదండలతో అధికారులపై దాడులకు తెగబడుతున్నారు. ఈ తరుణంలో సిబ్బందికి ఆయుధం ఇవ్వాలనే అంశం తెరమీదకు వస్తున్నా తర్వాత మరుగున పడుతోంది. దీంతో కలప అక్రమ రవాణా, కబ్జాలను నిలువరించలేకపోతున్నారు. నల్లమల అటవీ ప్రాంతం 26785 హెక్టార్లు, 28 ఫారెస్ట్ బీట్లు ఉన్నాయి. వెయ్యి హెక్టార్లకు ఒక బీట్ అధికారి ఉండాల్సినప్పటికీ నల్లమల అటవీ ప్రాంతంలో 3 వేల హెక్టార్లకు కూడా ఒక బీట్ అధికారి లేని పరిస్థితి. వీటికితోడు వీరికి ఆయుధాలు లేకపోవడంతో తరచూ దాడులు జరగడంతోపాటు కలప రవాణా ఈ ప్రాంతాల్లో జోరుగా సాగుతుంది. వీటికి అడ్డుకట్ట వేయాలంటే ఆయుధాలు తప్పనిసరి అని కొందరు అటవీశాఖ అధికారులు వాపోతున్నారు.

## నేటి నుంచి బొగ్గు నాణ్యతా వారోత్సవాలు

కొత్తగూడెం : సింగరేణిలో ఏటా బొగ్గు నాణ్యతా వారోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యతను పెంచాల్సిన అవసరాన్ని సమీక్షిస్తూ, నాణ్యత పెంపుదలపై ఉద్యోగులంతా దృష్టిపెట్టేలా ప్రోత్సహిస్తుంటారు. ఇందులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా గురువారం నుంచి వారం రోజుల పాటు (13 నుంచి 19 వరకు) బొగ్గు నాణ్యతా వారోత్సవాలను నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ఏరియాలకు బుధవారం సర్క్యులర్ జారీ చేసింది. నాణ్యత పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలను ఈ వారంలో ఉద్యోగులకు వివరిస్తారు.

**ఇంధన సరఫరా ఒప్పందాలతో అప్రమత్తం..**

సింగరేణి నుంచి బొగ్గును కొనుగోలు చేసే కంపెనీలు ఇంధన సరఫరా ఒప్పందాలను కలిగిఉంటాయి. ఈ ఒప్పందాల ప్రకారం సింగరేణి సంస్థ ఏ రకం బొగ్గును సరఫరా చేయాలో అదే నాణ్యతా ప్రమాణాలు కలిగిన బొగ్గును ఒప్పంద కాలం దాకా సరఫరా చేయాల్సి ఉంటుంది. నాణ్యతను పరీక్షించుకొనేందుకు బొగ్గు కొనుగోలు కంపెనీ ప్రతినిధులను కూడా సింగరేణి అనుమతిస్తుంది. కోల్‌టెస్టింగ్ ల్యాబ్‌లను కూడా యాజమాన్యం దీనికోసం అందుబాటులో ఉంచుతుంది. నాణ్యత తగ్గిన పక్షంలో సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకొన్న కంపెనీకి పెనాల్టీలను చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా బొగ్గు కొనుగోలు కంపెనీ మాత్రమే కాకుండా బొగ్గు నాణ్యతను పరిశీలించడంలో నైపుణ్యం ఉన్న మరే ఇతర కంపెనీనైనా నియమించుకొనే అధికారాన్ని కేంద్రం కొనుగోలు కంపెనీలకు ఇచ్చింది. దీంతో బొగ్గు విక్రయ సంస్థలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. దీనికోసం ఎప్పటికప్పుడు యాజమాన్యం నాణ్యతపై దృష్టిపెట్టాల్సి ఉంటుంది.

## బెదిరించి పుస్తెలతాడు చోరీ

వేములవాడ: చంపుతానని బెదిరించి ఓ మహిళ మెడలోంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన దేవులపల్లి బూదవ్వ, చంద్రయ్య దంపతులు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం నాంపల్లి గుట్టకు వెళ్లేందుకు తిప్పాపూర్ వద్ద ఆటో ఎక్కారు. కొంతదూరం వెళ్లాక ఆటో ఆపి మరోవ్యక్తి ఎక్కాడు. నాంపల్లి గుట్ట కమాన్ వద్ద ఈ దంపతులు ఆటో దిగగానే ఆటో ఎక్కిన వ్యక్తి సైతం దిగాడు. గుట్టపైకి కొంత దూరం నడుచుకుంటూ వెళ్లాక దంపతులను చంపుతానని బెదిరించి బూదవ్వ మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ.2 వేల నగదును లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు దంపతులు ఫిర్యాదు అందివ్వడంతో ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్మోహన్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.




## అమ్మో పిల్లలుంటే.. ఏమయ్యేదో!

నార్సింగి (చేగుంట) : రామాయంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నార్సింగికి చెందిన పలువురు విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిని బుధవారం సాయంత్రం దించేందుకు ఆ పాఠశాలకు చెందిన బస్సు ఊరికి చేరింది. ఆ డ్రైవరు పిల్లలను వాళ్ల ఇళ్ల వద్ద దించేశారు. రోజు మాదిరిగానే ఓ చోట బస్సును నిలిపి డ్రైవరు ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి వేళ ఒక్కసారిగా బస్సులో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి రామాయంపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది శకటంతో సహా అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేశారు. విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం జరగొచ్చని భావిస్తున్నారు. అందులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



## సిపిఐ శతవసంతాల బహిరంగసభలో పాల్గొనాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారధి**

తొర్రూరు, నవంబర్ 12 వాయిస్ టుడే : తొర్రూర్ మండలకేంద్రం లోని లయన్స్ భవన్ లో బుధవారం జరిగిన సిపిఐ మండల విస్తృత స్థాయి సమావేశానికి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడడానికి వామపక్ష పార్టీలు ఏకమై పోరాటం సాగించాలన్నారు. అడవుల్లో మావోయిస్టులు సాయుధ పోరాట పందాలు సాయుధ పోరాట పందాను వీడి కొత్త పందాలు వామపక్షాలతో కలిసి పనిచేయాలన్నారు దేశంలో ఓట్ల చోరీ చేసి మూడోసారి బిజెపి అధికారంలోకి వచ్చింది కానీ ఓట్ల చోరీ కాకుండా ఎన్నికలు జరిగితే బిజెపి కేవలం 100 సీట్లు వచ్చే ఈ కలిసి పనిచేయాలన్నారు దేశంలో ఓట్ల చోరీ చేసి మూడోసారి బిజెపి అధికారంలోకి వచ్చింది కానీ ఓట్ల చోరీ కాకుండా ఎన్నికలు జరిగితే ఈసీ స్పందించకపోవడం దారుణం అన్నారు దేశం బానిసత్వంలో ఉన్నప్పుడు పీడిత, తాడిత, ప్రజలకు దివిటీగా వారి, జీవితాలను త్యాగం చేసి,ఎన్నో విరోచిత పోరాటాలు జరిపి వాటికి నాయకత్వం వహించి అమరులైన వీరుల త్యాగాలతో శతవసంతాలు పూర్తి చేసుకుంది ఐదు లక్షల మందితో ఖమ్మంలో జరిగే ఖమ్మంలోసిపిఐ శతాబ్ది సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మాజీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శిలు గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్, ముద్దరబోయిన వెంకన్న, బూరుగు యాదగిరి,కోటగిరి యకాంతం, గూడెల్లి ఎల్లయ్య, ఈశ్వరయ్య, బొల్లు శీను, బొల్లు వెంకన్న, మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## సేవాతరుణి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తొర్రూరు, నవంబర్ 12 వాయిస్ టుడే : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. అన్నారం రోడ్డు వద్ద అల్పాహార వితరణ,డయాబెటిక్ క్యాంపు నిర్వహించి 70 మందికి షుగర్ బీపీ పరీక్షలు నిర్వహించారు.దాత మోక్ష గౌడ్ జన్మదినం సందర్భంగా క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డిసి లయన్ పి. రజిత - రవీంద్రనాథ్ కుమార్తె, వీరభద్ర రీజియన్-6, రీజియన్ చైర్ పర్సన్ దామెర సతీష్ మాట్లాడుతూ ఆటోలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ జిఎల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద, రీజియన్ చైర్ పర్సన్ లయన్ దామెర సరేష్, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి, సెక్రటరీ లయన్ కూన పద్మావతి, ట్రెజరర్ లయన్ వేముల మంజుల, లయన్ ఉమా రెడ్డి పాల్గొన్నారు.



## వరదబాధితులకు ఆర్థిక సహాయం

తొర్రూరు, నవంబర్ 12 వాయిస్ టుడే : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నరసయ్య అధ్యక్షతన బుధవారం వరద బాధితులకు 3వ సారి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వరంగల్ మహానగరంలోని శాయంపేట ప్రణయ్ భాస్కర్ కాలనీలో భారీ వర్షాల బాధ్యత 40 కుటుంబాలలోని పేద మహిళలకు ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువగల 10 కేజీల రైస్ బ్యాగ్స్, నిత్యవసర సరుకులు చింతపండు, ఉప్పు ,కారం,పసుపు, మసాలాలు పప్పులు మొదలగు తినే సామాన్లు మరియు దుప్పట్లు మొత్తం రూ.60 వేల రూపాయల విలువ గల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అదేవిధంగా 18 మంది మహిళలకు చీరలను,20 మంది పురుషులకు,పిల్లలకు టీ షర్ట్ లను అందజేశారు.ఈ కార్యక్రమంలో జీఎస్టీ కోఆర్డినేటర్ రేవూరి రమణ రెడ్డి, కాకతీయ రీజియన్ చైర్మన్ దుస్స శివశంకర్,వీరభద్ర రీజియన్ చైర్మన్ దామెర సరేష్, జోన్ చైర్మన్ చిదురాల నవీన్,క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి,వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ,బోనగిరి శంకర్,రాయల్స్ క్లబ్ ప్రెసిడెంట్ వలపదాస్ శ్యామ్ సుందర్, రాయల్స్ క్లబ్ సభ్యులు,రజనీకాంత్, కృష్ణకాంత్,పాల్గొన్నారు.